ప్రజాశక్తి

బుధవారం 4 సెప్టెంబర్ 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

లంకంత కష్టాలు



భట్టిప్రోలులోని ఓ లంక గ్రామంలో సగానికి పైగా నీటమునిగిన ఇళ్లు

- వరద నీటిలోనే గ్రామాలు
- కాస్త తగ్గుముఖం పట్టిన వరద ప్రవాహం
- పడవల ద్వారా మంచినీరు, ఆహారం పంపిస్తున్న యంత్రాంగం
- వరి, కంద, పసుపు, అరటితోటలకు భారీనష్టం
- లంక గ్రామాల్లో సహాయ కార్యక్రమాలను పరిశీలించిన మంత్రులు
- కరకట్టలను పటిష్టపరచాలని ఆదేశాలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రకాశం బ్యారేజి వద్ద నుంచి దిగువకు కృష్ణానదీ వరద ప్రవాహం కాస్త తగ్గుముఖం పట్టింది. మంగళవారం వరద 8.64 లక్షల క్యూసెక్కులకు తగ్గింది. వరద ఉధృతి తగ్గినా కానీ ఇంకా కొల్లూరు, భట్టిప్రోలులోని లంక గ్రామాలు ఇంకా వరద నీటిలో ఉన్నాయి. కరకట్టలు దెబ్బతిన్న క్రమంలో ఎక్కడ అయినా గండ్లు పడతాయోమే అన్న భయాందోళనలతో లంకగ్రామాల ప్రజలు సోమవారం బిక్కుబిక్కు మంటూ గడిపారు. వరదల కారణంగా 24 లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నారు. సుమారు 24 వేలమంది ప్రజానీకం గ్రామాల్లోనే ఉండిపోయారు. గ్రామాలలో ప్రజలు ఇబ్బందులు లేకుండా జనరేటర్లు ఏర్పాటు చేసి 750 విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు ఆహార పదార్థాలు అందించేందుకు 40 మరబోట్లు నడుపుతున్నారు. 65 మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. పోలీసులు, అధికారులతో పాటు గ్రామస్తులు కూడా కరకట్ట వెంట గస్తీ కాశారు.

వరద తగ్గుముఖం పట్టి వరదనీరు కొంచెం వెనక్కు వెళ్ళడంతో ప్రమాద పరిస్థితి నుంచి లంకగ్రామాలు గట్టెక్కాయి. ప్రకాశం బ్యారేజి నిర్మాణం జరిగాక ఇలాంటి వరద రావడం ఇదే మొదటిసారి అని లంక గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఊహించని రీతిలో వరద లంక గ్రామాలను చుట్టుముట్టడంతో అప్పటికప్పుడు ఎక్కడికి వెళ్లాలో తెలియక మిద్దెల పైకి సామానులను చేర్చి అందరూ అక్కడే వంటలు చేసుకొని ఉండిపోయారు. జిల్లాలోని ▶ 2లో



సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న మంత్రులు అనగాని, గొట్టిపాటి



నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ



కొల్లూరు మండలం, తోకలవానిపాలెం పరిధిలో వరద బాధితులకు పడవలో మంచినీరు, ఆహారం తీసుకెళ్తున్న సర్పంచ్, సిపిఎం నేత టి.కృష్ణమోహన్



లంక గ్రామాలకు ఆహారం, వాటర్‌బాటిళ్లను తీసుకెళ్లేందుకు సిద్ధమైన పడవలు

వరద బాధితులను ఆదుకోవాలి

- లంక గ్రామాల ప్రజలకు పరిహారం చెల్లించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి



వరద బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

కృష్ణానది వరద కారణంగా లంక గ్రామాల్లో నష్టపోయిన వాణిజ్య పంటలు, కోల్పోయిన గహాలకు పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం నష్టపరిహారం అందించి.. బాధితులను ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి డిమాండ్ చేశారు. కష్ణా నదికి సంభవించిన వరద పరిస్థితిపై మంగళవారం ఆమె కొల్లూరు, వెల్లటూరు, ఓలేరు గ్రామాల వద్ద వరద పరిస్థితిని పరిశీలించి.. అధికారులతో ▶ 2లో

విజయవాడకు
లక్షా 20 వేల ఆహార ప్యాకెట్లు..

- ఆహారాన్ని రుచి చూసి..
- పంపిన కలెక్టర్ అన్సారియా



విజయవాడకు పంపే ఆహారాన్ని రుచి చూస్తున్న కలెక్టర్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా దాతల సహకారంతో విజయవాడకు సుమారు ఒక లక్షా 20 వేల ఆహార ప్యాకెట్లు పంపించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఒంగోలు ఏ 1 కన్వెన్షన్ సెంటర్, బచ్చల బాలయ్య కళ్యాణ మండపంలో ఆహార పాకెట్స్ ను సిద్ధం చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా మంగళవారం ఉదయం పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. తొలుత కలెక్టర్ ఏ1 కన్వెన్షన్ సెంటర్‌ను సందర్శించి విజయవాడకు పంపటానికి సిద్ధం చేస్తున్న ఆహార పాకెట్స్ ను పరిశీలించి ఆహారాన్ని స్వయంగా రుచి చూశారు. సకాలంలో వరద బాధితులకు ఆహార పాకెట్స్ అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విజయవాడకు తరలించే ఆహారాన్ని నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అనంతరం కలెక్టర్ రైల్వేస్టేషన్ రోడ్డులోని బచ్చల బాలయ్య కళ్యాణ మండపంను సందర్శించి.. విజయవాడకు పంపటానికి సిద్ధం చేస్తున్న ఆహార పాకెట్స్‌ను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో జివి సుబ్బారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ టి. వసుంధర, ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు 62 మంది..

- జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో విశేష సేవలందించిన 62 మందికి ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి డి.సుభద్ర తెలిపారు. అవార్డులు పొందిన వారిలో 10 మంది ప్రధానోపాధ్యాయులు, 19 మంది స్కూలు అసిస్టెంట్లు, నలుగురు పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు, 29 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నారు. వీరికి ఈ నెల 5వ తేదీ జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో అవార్డులు ప్రదానం చేయనున్నట్లు డిఇఒ తెలిపారు.

వరద బాధితులను ఆదుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడారు. బాధితులకు అందుతున్న సహాయ సహకారాల గురించి అడిగి తెలుసుకున్నారు. పల్లెపాలెం గ్రామంలో పలువురు బాధితులు తమ గృహాల్లో ఉంచుకున్న ధాన్యం బస్తాలు, మినుము బస్తాలు పూర్తిగా తడిచిపోయాయని, వరద సంభవించడంతో కట్టుబట్టలతో బయటకు చేరామని రమాదేవి ఎదుట వాపోయారు. కొందరు ఇంటిలోని సామాన్లను పూర్తిగా కోల్పోయామని, వాటిలో కొంత నగదు కూడా ఉందని, అది ఏమైందో కూడా తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్దఎత్తున వరద సంభవించి లంక గ్రామాల ప్రజలకు తీవ్ర నష్టం కలిగించిందన్నారు. ప్రభుత్వం ముందుగా అంచనా వేయలేకపోవడంతో భారీ స్థాయిలో నష్టం వాటిల్లిందని, బాధితులు కూడా వరద తీవ్రత అర్థం చేసుకోలేకపోవ డంతో ఇబ్బందులకు గురయ్యారని పేర్కొన్నారు. సోమవారం కూడా పడవలు అందుబాటులోకి రాకపోవడం, దీనికి తోడు సకాలంలో డీజిల్ కూడా అందించలేక పోవడంతో బాధితులకు సకాలంలో తాగునీరు, ఆహార పదా ర్థాలు అందించలేకపోయారని పేర్కొన్నారు. సాయంత్రానికి విద్యుత్ సరఫరాను కూడా అందించే పరిస్థితులు కనిపించడం లేదన్నారు. దీని దష్ట్యా క్యాండిల్స్‌ను సరఫరా చేయాలని కోరారు. వరద తగ్గిన అనంతరం గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు ముందస్తు చర్యగా పారిశుద్ధ్య నిర్మూలన చేపట్టి, వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. పంటలు సాగు చేసిన వారిలో అధిక శాతం కౌలు రైతులు ఉన్నారని వారికి ఇప్పటికీ ఎలాంటి గుర్తింపు లేనందున రైతులు, కౌలు రైతులకు ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణగా నష్ట పరిహారం అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. వరద ప్రభావితానికి గురైన ప్రతి ఇంటిలో పూర్తిగా నిత్యవసర సరుకులు గహోపకరణాలు కోల్పోయారని, వాటికి అనుగుణంగా ప్రతి ఒక్కరికీ పరిహారం అందించాలన్నారు. రైతులకు కౌలుతో పనిలేకుండా పెరిగిన ధరలకు అనుగుణంగా పరిహారం అందించాలని, పారిశ్రామికక ేవేత్తలకు నష్టం జరిగితే ఏ విధంగా ప్రతి పైసానూ ప్రభుత్వం పరిహారం రూపంలో అందిస్తుందో అదే రీతిలో నష్టపోయిన రైతులకు కూడా పరిహారాన్ని ప్రభుత్వమే ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అందించే విధంగా చట్టాలను చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా లంక గ్రామాల్లో మురుగునీటి పారుదల సమస్య తీవ్రంగా ఉందన్నారు. వరదలు తగ్గిన అనంతరం పంట పొలాల్లో నిలిచిపోయిన వరద నీరు బయటకు వెళ్లే వసతి లేక పంటపొలాల్లో రోజుల తరబడి నీరు నిలబడి దెబ్బతినే అవకాశం ఉందన్నారు. వరదలు వచ్చిన సమయంలో మాట్లాడు కోవడమే కాకుండా అధికారులు చర్యలు చేపట్టి మురుగునీటి పారుదల వ్యవస్థకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. వరద బాధితులకు ప్రజలు కూడా స్వచ్ఛందంగా ఎవరికి తోచిన విధంగా వారు సహాయం చేసే విధంగా ముందుకు రావాలన్నారు. యువత కూడా పెద్ద ఎత్తున ముందుకు వచ్చి సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ భట్టిప్రోలు కొల్లూరు మండలాల్లో వరద కారణంగా సుమారు 20 గ్రామాలు జలదిగ్బధనంలో చిక్కుకున్నాయని, ఇప్పటికి అనేక మందికి సహాయక చర్యలు అందటం లేదన్నారు. ఈ ప్రాంతంలో కరకట్టలు కూడా చాలా బలహీనంగా ఉన్నాయని, వాటిని కాపాడుకోవడానికి కరకట్ట సమీప గ్రామస్తులు స్వచ్ఛందంగా నిద్రాహారాలు లేకుండా కషిచేసి నివారించుకోగలిగారన్నారు. బాధితులకు ఆహార పదార్థాలు, మందులు అందించేందుకు ఏర్పాటు చేసిన బోట్లు కూడా అందుబాటులో లేకపోవడం లోపంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. వరద నీటిలో చిక్కుకున్న 20 గ్రామాల్లో ప్రతి ఇంటికీ రూ.10 వేల సాయాన్ని అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు సాగుచేసిన పసుపు, కంద, అరటి వంటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి నష్టాలను చవిచూసిన రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం నష్టపరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి సుధాకర్, సిహెచ్ మణిలాల్, జి.నాగరాజు, బి.అగస్టీన్, పి.మనోజ్, రైతు సంఘం నాయకులు బి.ఎల్.కె.ప్రసాద్, బి.సుబ్బారావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే...

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

మండలంలో నలుగురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యా యులుగా ఎంపిక య్యారు. కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నారిశెట్టి వెంకట్రామయ్య, కోవిలం పాడు ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్‌జిటిగా పనిచేస్తున్న సిహెచ్. సునీతా దేవి, దర్శిగుంట్ల పేట, దర్శిగుంట్ల ప్రాథమిక పాఠశాలల్లో ఎస్‌జిటిలుగా పనిచేస్తున్న జి,రత్నమ్మ, ఇ.సరోజనమ్మ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈమేరకు డిఇఒ కార్యాలయం నుంచి స్థానిక ఎంఆర్‌సి మంగళవారం ఉత్తర్వులు అందాయి. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఎంఇఒలు ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి అభినందనలు తెలిపారు.


వెంకట్రామయ్య,


సరోజనమ్మ


రత్తమ్మ


సునీతా దేవి

పులిహోర ప్యాకెట్లు తరలింపు

ప్రజాశక్తి-మార్కాపురం

విజయవాడ వరద బాధితులకు ఆహారం అందించేందుకు మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్ చర్యలు చేపట్టారు. మార్కాపురం సమీపంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో పులిహోర మంగళవారం తయారు చేయించారు. 30వేల ప్యాకెట్లను బాక్సుల్లో పెట్టి లారీలో తరలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు కె.చిరంజీవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


లారీలో పులిహోర ప్యాకెట్లు తరలిస్తున్న దృశ్యం

'లంక'ంత కష్టాలు..

(మొదటిపేజీ తరువాయి)

కొల్లూరు, భట్టిప్రోలు మండలాలలోని లంక గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి. వరద కారణంగా లోతట్టులో నివాసాలు మునిగిపోయాయి. గ్రామస్తులు మిద్దెల మీద టార్పాలిన్ పట్టలతో తాత్కాలిక వసతి ఏర్పాటు చేసుకున్నారు. విద్యుత్ నిలిచిపోవడంతో గడిచిన రెండు రోజులుగా చీకటిలోనే గ్రామస్తులున్నారు. అధికార యంత్రాగం సోమవారం గ్రామస్తులకు ఆహారం, తాగునీటిని అందించలేక పోయారు. మంగళవారం మాత్రం ఉదయం నుంచి ముంపు గ్రామాలలోని బాధితులకు ఆహారం, మంచినీటిని అధికారులు పంపగలిగారు. పోలీస్ సిబ్బంది, ఎన్.డి.ఆర్.ఎఫ్, ఎస్.డి.ఆర్.ఎఫ్, ఫైర్ సిబ్బంది సహాయక పనుల్లో ఉన్నారు. లంక గ్రామాలకు చెందిన రోడ్లు వరదనీటి నుంచి బయటపడేందుకు మరికొన్ని రోజులు పట్టేలా ఉంది. బోట్లలో వస్తున్న ఆహారం, మంచినీటిని గ్రామస్తులు ట్రాక్టర్లపై తిరుగుతూ స్థానికులకు అందజేస్తున్నారు.

వరద ఉధృతి కొంతమేర తగ్గినప్పటికీ కొల్లూరు మండలంలోని గాజుర్లంక, పోతర్లంక, చిలుమూరు లంక, ఈపూరు లంక, సుగుణ లంక, పెద్దలంక, చింతల లంక, పెసరలంక, ఆవులువారిపాలెం, కష్ణా నగరు, తోకలవారిపాలెం, తురకపాలెం, తిప్పలకట్ట, కిష్కిందపాలెం, తడికలపూడి, జువ్వలపాలెం, భట్టిప్రోలు మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక, ఓలేరు, పల్లెపాలెం గ్రామాలు వరదనీటిలోనే ఉండిపోయాయి.

లంకగ్రామాల్లో ప్రధానసాగుగా ఉన్న కంద, పసుపు, అరటి తోటలకు భారీనష్టం వాటిల్లింది. వరి పైరు కూడా నీటిలోనే ఉండిపోయింది. వరద తగ్గాక గానీ పంటల నష్టం ఎంతమేర ఉందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. లంక గ్రామాల్లో ఫలసాయం ఏది దక్కదన్న బావనలో రైతులున్నారు. ముంపు లంక గ్రామాల సమస్యలపై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లు జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కరకట్టలను పటిష్ట పరచాలని ఆదేశాలిచ్చారు. ప్రధానంగా వరదలు తగ్గిన తరువాత అంటువ్యాధులు విజంభించకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. లంక గ్రామాలన్నీ నీటిలో ఉండిపోయాయి. బోట్లలో తప్ప గ్రామాలకు వెళ్ళేందుకు ఎలాంటి మార్గం లేకుండా పోయింది. కష్ణానది వరద కారణంగా లంక గ్రామాల్లో నష్టపోయిన వాణిజ్య పంటలు, కోల్పోయిన గహాలు, బాధితులకు జరిగిన నష్టాన్ని పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి, జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్యలు డిమాండ్ చేశారు.

వరద సాయంగా రూ. 50వేలు అందజేత

ప్రజాశక్తి-మార్కాపురం

ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) మార్కాపురం యూనిట్ ఆధ్వర్యంలో వరద సాయంగా రూ. 50వేల విరాళాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్రాదేవికి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అపుస్మా మార్కాపురం యూనిట్ అధ్యక్షుడు జి.మల్లికార్జునరెడ్డి, కార్యదర్శి పి.ప్రకాశరావు, కోశాధికారి పివి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.


డిఇఒకు వరద సాయం అందజేస్తున్న మల్లికార్జునరెడ్డి

పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి, ఉన్నత స్థానాలకు చేరాలని సిఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదరున్నిసా బేగం తెలిపారు. పాఠశాల పూర్వ విద్యార్థి ఎ.మహేంద్ర నాయుడు ఆధ్వర్యంలో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, స్కేళ్లు, పెన్సిళ్లు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత మహేంద్ర నాయుడు, నరేంద్ర, కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
3
బుధవారం 4 సెప్టెంబరు 2024

అధ్వాన రహదారిపై..

అవస్థల ప్రయాణం

- గుంతలమయమైన శానంపూడి రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండల కేంద్రానికి కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలోనే ఉన్నా.. గ్రామం అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలో ఉంది. శింగరాయకొండ మండల కేంద్రం నుంచి శానంపూడికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. అడుగుకో గుంత పడటంతో వాహన



వర్షం నీరు చేరి వాగును తలపిస్తున్న రహదారి

దారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు భారీ వర్షాలకు గుంతల్లో వర్షపు నీరు చేరి ఆటోలు, ద్విచక్రవాహనాలపై ప్రయాణించాలంటే నరకం కనిపిస్తోందని వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి చొరవతో శింగరాయకొండ నుండి శానంపూడికి తారు రోడ్డు మంజూరు చేసి నిర్మాణం చేపట్టారు. అయితే గత ఐదు సంవత్సరాలుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో కొండపి నియోజకవర్గంలో ఇన్‌ఛార్జిలు మారుతున్నారే కానీ అభివృద్ధిని పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో శానంపూడి గ్రామానికి శిగరాయకొండ నుంచి వెళ్లాలంటే అన్ని గుంటలతోనే రోడ్డంతా దర్శనమిస్తుంది. ఎక్కువ సంఖ్యలో ఆ గ్రామానికి ఆటోలు అధికంగా వెళుతుంటాయి. రాకపోకలకు జనం ఆటోలనే ఎక్కువగా వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం గత రెండు రోజులుగా కురిసిన వర్షాల దెబ్బకు రోడ్డు పూర్తిస్థాయిలో పోయి గుంతలమయం అయి, గుంటల్లో నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోలు, బైకులు, ట్రాక్టర్లు రావాలంటే ఎక్కడ ఏ గుంత ఉందో అర్థం కాక జనం అల్లాడిపోతున్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఈ రోడ్డుకి ఎలాంటి నిధులు మంజూరు చేయలేక గ్రామ సర్పంచి సైతం ఏమీ చేయలేని పరిస్థితి ఆ గ్రామంలో కనిపిస్తోంది. ఎన్నిసార్లు



గుంతలమయమైన రహదారి

అధికారులకు ఫిర్యాదులు చేసినా గత ప్రభుత్వంలో పట్టించుకోలేదని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రస్తుతం గ్రామస్థులు మంత్రి స్వామిపై ఆశలు పెట్టుకొన్నారు. పూర్తిస్థాయిలో శాశ్వతంగా రోడ్డు నిర్మాణం చేపడతారని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పట్టించుకోవాల్సిన పంచాయతీరాజ్ శాఖ అధికారులు మాత్రం నిధులు లేవని చేతులెత్తేస్తున్నారు. మంత్రి స్వామి జోక్యం చేసుకొని శానంపూడి గ్రామానికి శాశ్వత రోడ్డు నిర్మాణం చేపట్టి సమస్యలు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సిపిఎం సభ్యులు ప్రభాకరరావుకు సతీవియోగం

ప్రజాశక్తి - కొత్తపట్నం



పట్టపు పిచ్చమ్మ (ఫైల్)

కొత్తపట్నం గ్రామానికి చెందిన సిపిఎం సభ్యులు పట్టపు ప్రభాకర్ రావుకు సతీ వియోగం కలిగింది. ఆయన భార్య పట్టపు పిచ్చమ్మ (60) అనారోగ్యంతో మంగళవారం అర్ధరాత్రి మృతిచెందారు. ఆమె పెద్ద కుమారుడు సునీల్ కొత్తపట్నం మండల ప్రజాశక్తి విలేకరిగా పనిచేస్తున్నారు. చిన్న కుమారుడు ప్రవీణ్ కుమార్ ప్రకృతి వ్యవసాయంలో పని చేస్తున్నాడు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్



గాయపడిన నూరి

గొడవల నేపథ్యంలో వ్యక్తిపై దాడి చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సైదాబాబు తెలిపారు. ఈ సంఘటన పట్టణంలోని చిన్న మసీదు వద్ద మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఎస్సై కథనం ప్రకారం.. చిన్న మసీదులో మౌజన్‌గా పని చేస్తున్న నూరి అనే వ్యక్తికి అతని ఇంటి పక్కనే నివాసముంటున్న బ్యాటరీ వ్యాపారస్తుడు భాష కుటుంబానికి తరుచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో మంగళవారం నూరి ఇంటిపై ఉన్న వాటర్ ట్యాంకు సంబంధించిన వాల్‌ను తిప్పి ట్యాంక్‌లోని నీళ్లను ఖాళీ చేయడంతో ప్రశ్నించాడని బాష అతని కుమారులు సోహెల్, షోహెబ్ నూరిపై ఇటుకరాళ్లు, కర్రలతో దాడిచేశారు. ఈ దాడిలో నూరి తలకు కంటికి తీవ్ర గాయాలయి రక్తస్రావం కావడంతో స్థానికులు మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. క్షతగాత్రుడు నూరి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - హనుమంతుని పాడు

మండల పరిధిలోని మొరవారిపల్లి గ్రామంలో పేకాట శిబిరంపై మంగళవారం దాడులు నిర్వహించి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శివనాగరాజు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రెండు బైకులు, నాలుగు మొబైల్ ఫోన్లు, రూ.7,120 రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.



తనిఖీలు నిర్వహిస్తున్న మార్క్‌ఫెడ్ డిఎం హరికృష్ణ

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

మార్క్‌ఫెడ్ డిఎం హరికృష్ణ

ప్రజాశక్తి - మద్దిపాడు

ఎరువులకు సంబంధించి రికార్డులు సక్రమంగా నిర్వహించాలని మార్క్‌ఫెడ్ డిఎం హరికృష్ణ అన్నారు. మండల పరిధిలో వెల్లంపల్లి, దొడ్డవరం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఉన్న ఎరువుల గోదాములను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టాకును పరిశీలించారు. ఎరువులు అమ్మిన వెంటనే డబ్బులు కట్టించుకోవాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీలలో ఒంగోలు వ్యవసాయ కార్యాలయ ఏవో కిషోర్, శ్రీనివాసరావు వ్యవసాయ అధికారి కిషోర్, శ్రీనివాసరావు, ఏవో కె.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే నిర్వహించాలి

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించాలని గిద్దలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహబూబ్ షరీఫ్ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. గిద్దలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆయన ఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించాలని, జ్వర పీడితులు వెంటనే ఆరోగ్య కేంద్రాలకు వెళ్ళేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పంట నష్టం వివరాలు సేకరించాలి

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి - గిద్దలూరు



అధికారులతో మాట్లాడుతున్న అశోక్ రెడ్డి

తుపాను ప్రభావంతో పంట నష్టం వివరాలు సేకరించి, రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని సెరికల్చర్, హార్టీకల్చర్, అగ్రికల్చర్ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని గ్రామాలలో నమోదైన వర్షపాతం, వర్షాలు, వరదల ఉధృతి వలన రైతులు నష్టపోయిన పంటల వివరాలు సేకరించాలన్నారు. అదే విధంగా ఉద్యానవన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, రైతాంగానికి ప్రభుత్వం కల్పించే అవకాశాలను క్షేత్రస్థాయిలో తెలియజేసి రైతులకు అండగా నిలవాలని తెలిపారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పరిపాలన కొనసాగిస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రతి అధికారి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏడీఏ బాలాజీ నాయక్, సెరికల్చర్ టీపీవో పాండురంగారెడ్డి, హార్టికల్చర్ హెచ్.ఒ.లు శ్వేతా, విష్ణుప్రియ, రెవిన్యూ ఏఎస్ఓ మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద జీవోలు వెంటనే అమలు చేయాలి

సిఐటియు మండల కార్యదర్శి ఆదిలక్ష్మి

ప్రజాశక్తి - మద్దిపాడు



వినతిపత్రం అందజేస్తున్న ఆదిలక్ష్మి, ఆశా కార్యకర్తలు

ఒప్పంద జీవోలు వెంటనే అమలు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రాథమిక వైద్యశాల డాక్టర్ ఆనంద్ మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్స్ వేతనాలు పెంచాలని, 2024 ఫిబ్రవరి 9న ప్రభుత్వం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రతినిధి వర్గంతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జీవోలు, సర్క్యులర్స్ వెంటనే అమలు చేయాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆశా వర్కర్స్‌కు విడుదల చేయవలసిన ఒప్పంద జీవోలు తాత్కాలికంగా నిలుపుదల చేశారని, వెంటనే విడుదల చేయాలని అన్నారు. పని భారంతో అల్లాడుతున్న ఆశా వర్కర్స్ సమస్యలపై సార్వత్రిక ఎన్నికల రీత్యా జాయింట్ మీటింగ్స్ జరగలేదని, ఫీల్డ్ వర్క్, సెంటర్ వర్క్, అదనపు పనులు, పనిచేయని సెల్‌ఫోన్‌లతో ఎక్కువమంది కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఒక గంట పర్మిషన్ కావాలన్నా, ఒకరోజు సెలవు కావాలన్నా అధికారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో అన్నపూర్ణ, అక్కమ్మ, ఝాన్సి, రూతు, నిర్మల, రమణ తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు ఏలూరి లక్ష్మి దేవి ట్రస్ట్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడు మండలంలో కొత్తపల్లి గ్రామంలో నీటి కుంటలో పడి ముగ్గురు విద్యార్థులు దుర్మరణం పాలైన సంఘటన తెలిసిందే. ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి మానవతా దృక్పథంతో స్పందించి మంగళవారం సాయంత్రం కొత్తపల్లి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం మృతి చెందిన అరవిటి ఏడుకొండలు, కొత్తపల్లి శివ ప్రసాద్ ఆచారి, కొత్తపల్లి మన్ను ఆచారిల కుటుంబ సభ్యులకు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తమ ట్రస్ట్ ద్వారా ఒక్కొక్కరి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గొట్టం శ్రీనివాస రెడ్డి, మార్కాపురం నియోజకవర్గ బిజెపి ఇన్‌ఛార్జి పీవి కృష్ణారావు, పెద్దారవీడు, పెద్ద దోర్నాల మండలాల బిజెపి అధ్యక్షులు బొచ్చు కోటిరెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - మద్దిపాడు

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని మద్దిపాడు ఎస్ఐ శివరామయ్య అన్నారు. వినాయక చవితి సందర్భంగా గణేష్ విగ్రహ ప్రతిష్ట, పందిల్లు, మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి 5 లేదా ఎందుకంటే ఎక్కువ మంది సభ్యులతో కమిటీలుగా ఏర్పడి వారి వివరాలు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలపాలన్నారు.



విజయవాడ ముంపు ప్రాంతాల్లో ఎంఎల్‌ఎ కొండయ్య

సహాయక చర్యల్లో ఎంఎల్‌ఎ కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

భారీ వర్షాల కారణంగా విజయవాడలో వరద ముంపుకు గురైన గ్రామాల్లో బాధితులకు ఎంఎల్‌ఎ కొండయ్య సహాయం అందించారు. పడవ సాయంతో స్వయంగా బాధితుల వద్దకు వెళ్ళి పరామర్శించారు. వరద నీటిలో అల్లాడుతున్న గొల్లపూడి, భవానిపురం ప్రాంతాల్లో ఆయన కనిగిరి శాసన సభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలసి పర్యటిచారు. చీరాల వాడరేవు నుండి ఐదు పడవలు, పడవలు నడపగలిగిన మత్స్యకారులను వెంట తీసుకెళ్లి వరద బాధితుల అవసరమైన సహాయక చర్యలు చేపట్టారు. బాధితులకు అల్పాహారం, త్రాగు నీటిని అందజేశారు. ఆయన వెంట పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఎంఇఒలు

ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని ఆరుగురు ఉపాధ్యాయులకు స్థానిక విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగులో నూతలపాటి జయమ్మ అనే ఉపాధ్యాయురాలు పంగులూరులోని ప్రాథమిక పాఠశాల నుండి బూదవాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్) కు బదిలీ అయ్యారు. నూజెళ్ళపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుండి గ్రేస్ మనోరమ కస్యాపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. బైట మంజులూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నుండి కొండ మంజులూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎస్సీ) కి బదిలీ అయ్యారు. మరో ముగ్గురు ఉపాధ్యాయులు డివిజన్‌కు బదిలీ అయినట్లు ఎంఇఒలు కె నాగభూషణం, జి వీరాంజనేయులు నిర్వహించారు.



సిఐ శ్రీనివాసరావును అభినందిస్తున్న ఆటో నాయకులు

సిఐకి ఆటో యూనియన్ అభినందన

ప్రజాశక్తి - చీరాల

ఒకటవ పట్టణ సిఐగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఎం శ్రీనివాసరావును స్థానిక దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు వాసిమల్ల వాసు ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ఆటో డ్రైవర్లు పోలీసులకు సహకరించాలని కోరారు. నిర్దేశించిన ప్రదేశాల్లోనే ఆటోలు నిలుపుకుని ప్రయాణికులను ఎక్కించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు మార్పు కుమార్, వైస్ ప్రెసిడెంట్ రాజేష్, సెక్రటరీ మల్లి ఆనంద్, జాయింట్ సెక్రెటరీ డి శ్యాంసన్, ట్రెజరర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

ప్రజాశక్తి - రేపల్లె



మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

వరద బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రజలకు భరోసా ఇచ్చారు. రేపల్లె, పెనుముడి కృష్ణానది వారధి దగ్గర వరద ముంపుకు గురైన ప్రాంతాలను ఆయన మంగళవారం పరిశీలించారు. పెనుమూడిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, కలెక్టర్ వెంకట మురళితో కలసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో కృష్ణా నదికి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వరదలు వచ్చాయని అన్నారు. 2009లో కృష్ణా నదికి 10 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చిందని అన్నారు. ప్రస్తుతం 13 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినట్లు తెలిపారు. 2009లో కృష్ణానదికి ఓలేరు, పల్లెపాలెం వద్ద గండిపడటంతో రేపల్లె ప్రాంతం అతలా కుతులమైందని అన్నారు. ప్రస్తుతం అతి భయంకరమైన వరదలు వచ్చినప్పటికీ అధికారులు, నాయకులు మన్వయంతో పనిచేసి విపత్కర పరిస్థితి నుంచి కృష్ణా నది తీరప్రాంతాన్ని కాపాడటం అభినందనీయం అన్నారు. ప్రస్తుతం కృష్ణా నదికి వరద ముప్పు కొంతమేర తగ్గిందని చెప్పారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు తాగునీరు, ఆహార పదార్థాలు, భోజన వసతితో పాటు నిత్యవసరాలు, పాలు, మందులు అందించనున్నట్లు తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులంతా శ్రద్ధతో స్వచ్ఛందంగా సేవలు అందించారని అన్నారు. వరదలు ప్రారంభమైన నాటినుండి ఇప్పటి వరకు నిద్ర హారాలు మాని కరకట్టపై అధికారులు తోపాటు నాయకులు గస్తీలు కాసి కరకట్ట పటిష్టతను బలపరిచే విధంగా చర్యలు తీసుకొని వరద నివారణ చర్యలు చేపట్టారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి గతంలో రైతులను పరామర్శించడానికి జిల్లాకు వచ్చినప్పుడు పరదాలు కట్టుకొని రెడ్ కార్పెట్లు వేసుకొని బురద నీటిలో దిగకుండా ఉత్తుత్తి పరామర్శలు చేసి వెళ్లారని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి విజన్ ఉన్న గొప్ప నాయకుడు చంద్రబాబు నాయుడు ప్రత్యక్షంగా వరదనీటిలో తిరుగుతూ ప్రజలతో మమేకమై ప్రజల అవసరాలు ఎప్పటికప్పుడు తీరుస్తూ ఎక్కడ ఏ విధమైన ఇబ్బందులు తల ఎత్తకుండా అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం వరద ఉధృతి తగ్గిందని తెలిపారు. రానున్న నాలుగైదు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరదలు సంభవించిన ప్రాంతాల్లో ఎటువంటి అంటూ వ్యాధులు ప్రబలకుండా వైద్య అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అధైర్యపడ్డ పడవద్దని అన్నారు. ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ జె వెంకట మురళి, ఆర్డిఓ హేలా షారన్, డిఎస్పి మురళీకృష్ణ, టీడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులను అదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - రేపల్లె



మంత్రులతో మాట్లాడుతున్న సిపిఎం నేత మణిలాల్

వరద బాధితులను అని విధాలుగా అదుకోవాలని మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ మణిలాల్ కోరారు. పెనుమూడి వరద ముంపు ప్రభావాన్ని పరిశీలించి పునరావస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ టి కృష్ణ ప్రసాద్, కలెక్టర్ జెవి మురళి, ఇతర రెవెన్యూ సిబ్బంది సమక్షంలో పెనుమూడి పునరావస కేంద్రం వద్ద కలిసి మాట్లాడారు. పెనుమూడి, కట్టకింద్ర పల్లెపాలెం ప్రజలకు పక్కా గృహాలు నిర్మాణం చేయాలని కోరారు. వరద అనంతరం నష్టపరిహారం అందజేయించాలని కోరారు. లంక గ్రామాలకు నిన్న భోజనం అందకపోవడంతో ప్రజలు ఆకలితో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రేపల్లె ప్రాంతంలో కరకట్ట తెగకుండా వరద నివారించడంలో అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధుల కృషి ద్వారానే సాధ్యపడిందని అన్నారు. పెనుమూడి సిపిఎం కార్యదర్శి వి మావో పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ ద్వారా ఆహార పదార్థాలు పంపిణీ

ప్రజాశక్తి - కర్లపాలెం



ఆహారం అందిస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

వరద ప్రభావిత ప్రాంతాల్లో శిబిరాల్లో ఉన్న వరద బాధితులకు రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు ఆహార పదార్థాలు మంగళవారం పంపిణీ చేశారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బిఎస్ నారాయణ బట్టు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పెనుమూడి, భట్టిప్రోలు, వెల్లటూరు ప్రాంతాల్లో బాధితులకు పండ్లు, బిస్కెట్లు, ఆహార పదార్థాలు అందించారు. గూడ శ్రీనిధి, కార్తికేయ, పానకాల రాయుడు సహకారంతో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రేపల్లె ఎంపిడిఒ శివ పార్వతి, తహశీల్దారు శ్రీనివాస్, రెడ్ క్రాస్ జిల్లా ప్రతినిధులు డివి రమణబాబు, మల్లెల వేణు, కర్లపాలెం రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఈ పోలీసురావు, అంబటి కృష్ణ పాల్గొన్నారు.

వరద ఉధృతి తగ్గేవరకు అప్రమత్తంగా ఉండాలి

అధికారులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశం

ప్రజాశక్తి - రేపల్లె

కృష్ణానది వరద ఉధృతి పూర్తిగా తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు కొనసాగించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. జలదిగ్బంధంలో చిక్కుకున్న లంక గ్రామాల్లోని ప్రజలకు కొల్లూరు లాకుల వద్ద నుంచి 40బోట్ల ద్వారా భోజనం, తాగునీరు, ఆహార పదార్థాలను పంపిణీ ప్రక్రియను మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ జె వెంకట మురళి, ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్, శాసన సభ్యులు నక్కా ఆనందబాబుతో కలిసి మంగళవారం పరిశీలించారు. వివిధ ప్రాంతాలకు వెళ్తున్న ఆహార పదార్థాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరద పరిస్థితిపై అధికారులతో ఎండిఓ కార్యాలయంలో సమీక్షించారు. కరకట్ట బలహీనపడిన ప్రాంతాలను పరిశీలించి కరకట్ట బలోపేతం చేయాలని తెలిపారు. నాణ్యమైన రుచికరమైన భోజనం నిర్వాసితులకు అందించాలని సూచించారు. 4రోజులుగా అధికారులు పగలు, రాత్రి శ్రమించడం, ప్రజలకు ఎలాంటి సమస్య రాకుండా సమర్థంగా సహాయక చర్యలు చేపట్టారని ప్రశంసించారు. కరకట్ట తెగకుండా బలోపేతం చేయడం అభినందనీయ మన్నారు. రహదారిపై పడిన గండ్లు పూడ్చాలన్నారు. లంక గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణకు ఎపిసిపిడిసిఎల్, ఎస్పీడీసీఎల్ నుంచి 1000 మంది లైన్మెన్లను పంపుతా మన్నారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. లంక గ్రామాలకు వెయ్యి సోలార్ దీపాలు ఇస్తామన్నారు. రెండు విద్యుత్ సబ్ స్టేషన్లు దెబ్బతిన్నాయన్నారు. బోట్లు ప్రయాణిస్తున్నందున విద్యుత్ నిలిపివేసి జనరేటర్ల ద్వారా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు. బోట్లలో వెళ్లే వారికి తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు ఉండేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరద తగ్గిన తర్వాత విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని అన్నారు. వరద తగ్గిన తర్వాత సహాయక చర్యలు కొనసాగించాలని చెప్పారు. సర్వే కొరకు ప్రకాశం జిల్లా నుంచి అధికారులను పంపుతామన్నారు.

ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రాణ నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రమాదం పొంచి ఉందని గుర్తించి అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో మరో 48 గంటలపాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇప్పటివరకు అధికారుల టీం వర్క్ బాగుందని అన్నారు. ఎంతో బాధ్యతతో పనిచేశారని అన్నారు. అనారోగ్యానికి గురికాకుండా పారిశుద్ధ్య పనులు శరవేగంగా చేపట్టాలని అన్నారు. 24వేల మందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రికి భోజనం అందించడం సాహసోపేతమైన చర్యగా అభివర్ణించారు. ఇతర జిల్లాల నుంచి అవసరమైన అధికారులను నియమిస్తామన్నారు. ఇప్పటికే నలుగురు ఉప కలెక్టర్లను నియమించినట్లు తెలిపారు. మరో రెండు రోజులు అధికారులు బాధ్యతగా పని చేయాలన్నారు. కరకట్టకు అనధికారికంగా 65పైపులైన్లు కొందరు వేయడంతో ఆ ప్రాంతంలో కరకట్ట బలహీన పడిందన్నారు. వాటిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

కృష్ణానది వరద ఉధృతి 8.64 లక్షల క్యూసెక్కులకు తగ్గడంతో ప్రమాదం కొంత మేరకు తగ్గినట్లేనని కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. వరద తగ్గిన తర్వాత లంక గ్రామాల్లో పేరుకున్న బురద, చెత్తను యుద్ధ ప్రాతిపదికన తొలగించడానికి యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. చరిత్రలో ఎన్నడు లేనంతగా కృష్ణానది వరద ప్రవాహం 11.50 లక్షల క్యూసెక్కులకు చేరడంతో 24 హ్యాబిటేషన్లు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయన్నారు. అందులో 24వేల మంది లంక గ్రామాల్లోనే ఉండిపోయారని తెలిపారు. ఆ గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా జనరేటర్లు ఏర్పాటు చేసి 750విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు. వారికి ఆహార పదార్థాలు అందించడానికి 40మర బోట్లు నడుపుతున్నామని తెలిపారు. 200 లైఫ్ జాకెట్లు కొనుగోలు చేసే సిద్ధంగా ఉంచామన్నారు. 65మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. కరకట్టలు 4చోట్ల బలహీనపడి లీక్ అవుతున్నప్పటికీ ప్రజల సహకారంతో యుద్ధ ప్రాతిపదికన నివారించ గలిగామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రోజుకి 3పర్యాయాలు జిల్లా పరిస్థితులపై ఫోనులో మాట్లాడుతున్నారని చెప్పారు. అధికారుల పనితీరుపై సీఎం ప్రశంసించారని తెలిపారు. ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఫోన్లో మాట్లాడి అధికారుల పనితీరును అభినందించారని అన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రులు సత్యప్రసాద్, రవికుమార్

ఒక కుటుంబానికి 25కేజీల బియ్యం, ఒక లీటర్ నూనె, కిలో కందిపప్పు, కిలో పంచదార, కిలో బంగాళ దుంపలు, కిలో ఉల్లిపాయలు, చేనేతలు, మత్స్యకారులు ఉంటే ఆ కుటుంబాలకు 50కిలోల బియ్యం ఇవ్వాలని ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం 9వేల కుటుంబాలకు సరిపడా సరుకులు సిద్ధంగా ఉంచామన్నారు. 56వేల లీటర్ల నీళ్లు అందజేసినట్లు తెలిపారు. సమన్వయంతో పనిచేస్తే ఎంతో ప్రయోజనం అన్నారు. నిత్యవసర సరుకులు, వైద్యం సకాలంలో అందించేలా చూడాలన్నారు. సహాయక చర్యలపై అధికారులు పనిచేస్తే విపత్తు నుంచి పూర్తిగా బయటపడతామని తెలిపారు. వరద తగ్గిన తర్వాత సహాయక చర్యలకు యంత్రాంగం సిద్ధం కావాలని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు తెలిపారు. గతంలోకంటే వరద అధికంగా రావడంతో ప్రజలకు ఇబ్బందులు వచ్చాయని అన్నారు. ప్రజలకు సహాయం అందించడంలో అధికారులు వెనుకాడ వద్దని అన్నారు. అధికారికంగా ప్రకటించే వరకు లంక గ్రామాల్లోని ప్రజలు ఎలాంటి రాకపోకలు సాగించరాదని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం సమర్థంగా పనిచేస్తుందన్నారు. పోలీసులు నిరంతరాయంగా గ్రామాల్లో సహాయక చర్యలు చేపట్టారని తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్పీ టి.పి.విఠలేశ్వర్

అధికారుల సమన్వయంతో బాధితులు సురక్షితం

అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్

ప్రజాశక్తి-వేమూరు

పోలీసు, రెవెన్యూ, తదితర శాఖల అధికారుల సమన్వయంతో లంక గ్రామాల్లో చిక్కుకుపోయిన బాధితులు సురక్షితంగా బయటపడ్డారని బాపట్ల జిల్లా అదనపు ఎస్పీ టీపీ.విఠలేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరద వస్తున్నట్లు సమాచారం అందడంతో వరదకు ముందు రోజు కొల్లూరు మండలం చిలుమూరు లంక గ్రామంలో గ్రామస్తులకు అవగాహన కల్పించి వారిని బయటకు రప్పించేందుకు అన్ని విధాలా ప్రయత్నాలు చేశామన్నారు. కానీ గ్రామస్తులు శిబిరాలకు రాకపోవడంతో తాము కూడా అదే గ్రామంలో ఉండిపోయామన్నారు. రాత్రికి రాత్రి వరద పెరిగిపోవడంతో చేసేది ఏమీ లేక గ్రామస్తులతో కలిసి అక్కడే ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గ్రామస్తులు కూడా తమతో సహకరించారని, వరద తగ్గిన అనంతరం గ్రామంలో గహాల నుండి వరద తగ్గిపోవడంతో వారికి తగిన సలహాలు సూచనలు అందించి అక్కడి నుండి రావడం జరిగిందన్నారు. కాగా జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధితులకు సకాలంలో తాగునీరు, ఆహారం సరఫరా చేయడం జరిగిందని వివరించారు.

లంక గ్రామాల్లో పంటలకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

కృష్ణానదికి సంభవించిన వరద ప్రభావంతో లంక గ్రామాల్లో పంటలకు తీవ్ర నష్టం సంభవించింది. భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో సుమారు 20కి పైగా లంక గ్రామాల్లో రైతులు సాగుచేసిన పసుపు, కంద, అరటి, కూరగాయలు వంటి తదితర వాణిజ్య పంటలు పూర్తిగా నీట మునిగాయి. ముఖ్యంగా గ్రామాల్లో వేల సంఖ్యలో ప్రజలు వరదనీటికి గహాలపై ఉండి దోమలు, పాములు, జెర్రలతో కలసి జీవించాల్సిన దుస్థితి ఏర్పడింది. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో నూతన ప్రాంతాల్లో గహాలు సైతం పూర్తిగా నీటమునిగిపోవడంతో ప్రభుత్వం సరఫరా చేసే తాగునీరు, భోజనం, వసతి అందక అనేకమంది విలవిలలాడారు. చిన్నపిల్లలు, వద్ధులు అనారోగ్యంతో ఉన్నవారు వైద్య సౌకర్యాలు లేక నానాఅవస్థలు ఎదుర్కొన్నారు. వరద తగ్గుముఖం పట్టినప్పటికీ గ్రామాల్లో రహదారులపై నీరు ప్రవహిస్తూనే ఉంది. డాబాలపై ఉన్నవారు కిందకు దిగటానికి అవకాశం లేక పైనే ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. అనేక గ్రామాల్లో రైతుల ఎండు గడ్డివాములు కొట్టుకుపోవడంతో వరద తగ్గాక పశువులకు మేత దొరికే పరిస్థితి ఉండదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో పశువులను మెరక ప్రాంతానికి తరలించడానికి కూడా అవకాశం లేక నీటిలోనే ఉంచిన పరిస్థితి నెలకొంది. శనివారం బాధితులకు ఆహార సౌకర్యాలు కల్పించడంలో అధికారుల సమన్వయ లోపం కారణంగా బాధితులకు ఆహార పదార్థాలు అందని పరిస్థితి ఏర్పడటంతో... మంగళవారం నుండి అధికారులు కొంతమేర ప్రతి ఒక్కరికీ ఆహార పదార్థాలు అందేవిధంగా చర్యలు చేపట్టారు. అధికారులు సమకూర్చిన ఆహార పదార్థాలతో పాటు పలువురు స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా వేల సంఖ్యలో ఆహార పొట్లాలను సిద్ధం చేసి బాధితులకు చేరవేసేందుకు కషి చేశారు. వరద గ్రామాల నుండి పూర్తిగా తగ్గటానికి మరో మూడు, నాలుగు రోజులు పట్టే పరిస్థితులు ఉన్నాయని అప్పటివరకు బాధితులకు అధికారులు క్రమం తప్పకుండా తాగునీరు, ఆహార పదార్థాలు మరియు విద్యుత్ సౌకర్యం లేనందున తగిన ఏర్పాట్లను చేయాలని బాధితులు కోరుతున్నారు.

నిండా మునిగిన ఇటుక బట్టీల యజమానులు



వరద నీటిలో మునిగిన ఇటుక బట్టీలు

ఇటుక బట్టీల రైతులకు తీవ్ర నష్టం

కొల్లూరు మండలంలో నెలకొన్న ఇటుక బట్టీలు యజమానులకు ఈ వరద కారణంగా తీవ్ర నష్టం ఏర్పడింది. నవంబర్ డిసెంబర్ నెల నుండి ఇటుక తయారీ చేసుకోవలసి ఉన్నందున దాని కొరకు ముందుగానే యజమానులు లక్షలాది రూపాయలు వెచ్చించి ఊక, మట్టిని సిద్ధం చేశారు. వరద ఉధతి వేగంగా రావడంతో పూర్తిగా ఊక నీటిపాలు కాగా ఉధతి ప్రాంతంలో ఉన్న మట్టి కూడా వరద ప్రవాహానికి కొట్టుకుపోయి ఉంటుందని బట్టి యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని కారణంగా ఒక్కో రైతు ఎనిమిది నుండి పది లక్షల పైగా ఇటుక సిద్ధం చేసుకుని ఉన్నాడని, ఈ పెట్టుబడి మొత్తం పూర్తిగా వరద పాలయ్యిందని వాపోతున్నారు. వరద నీరు పూర్తిగా తగ్గిపోయి లారీలు బట్టీల వద్దకు వెళ్లేటప్పటికీ మరో నెల రోజులు పైగా సమయం పట్టే పరిస్థితి నెలకొందని, అప్పటివరకు ఇటుక వ్యాపారాలు కూడా నిలిచిపోయి మరో రూపంలో నష్టం జరిగిందని వాపోతున్నారు.

సహాయక చర్యలపై ప్రణాళికలు రూపొందించుకోవాలి

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వరద ప్రవాహం తగ్గిన తర్వాత లంక గ్రామాలలో సహాయక చర్యలపై అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. వరద ముంపు తదుపరి చర్యలపై జిల్లా అధికారులతో మంగళవారం స్థానిక కొల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ముందుగా టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. భారీ వర్షాలు, వరదతో దెబ్బతిన్న ప్రాంతాలలో అధికారులు పర్యటించాలని కలెక్టర్ చెప్పారు. లంక గ్రామాలలోని ప్రతి వ్యక్తికి ఆహార పదార్థాలు అందేలా చూడాలన్నారు. భోజన పదార్థాల అందించడంలో ఇబ్బందులు ఎదురైతే పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. భోజనం అందలేదనే ఫిర్యాదులు ఎట్టి పరిస్థితుల్లో రాకూడదన్నారు. సహాయక చర్యలపై డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే నలుగురు అధికారులను సస్పెండ్ చేశామన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ అల్పాహారం అందించాలి

లంక గ్రామాలలో చిక్కుకున్న ప్రతి ఒక్కరికి అల్పాహారం, భోజనం, తాగునీటిని అధికారులు సమద్ధిగా అందించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. కొల్లూరు లాక్ ల వద్ద నుంచి మర బోట్ల ద్వారా లంక గ్రామాలకు చేరుతున్న అల్పాహారం, భోజన పదార్థాలను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఉదయం ఎనిమిది గంటలకే లాక్ ల వద్దకు చేరుకుని నిత్యావసర వస్తువుల పంపిణీపై ఆయన ఆరా తీశారు. ఎవరికీ అందలేదని ఫిర్యాదులు రాకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు లంక గ్రామాలలోనే మూడు రోజుల నుంచి బస చేయడంపై కలెక్టర్ ఫోన్ లోనే మాట్లాడారు. 48 మర బోట్లతో ఆహార పదార్థాలు తరలిస్తున్నామని, మరో ఆరు బోట్లు సిద్ధంగా ఉంచామన్నారు. అత్యవసర పరిస్థితుల కొరకు రెండు హెలికాప్టర్లు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఆయన వెంట మత్స్య శాఖ జెడి పి సురేష్, గహ నిర్మాణ శాఖ పిడి ప్రసాద్, అనుబంధ శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

మానవత్వంతో పనిచేయాలి..

ఈ విపత్కర పరిస్థితుల్లో జిల్లా అధికార యంత్రాంగం అంతా సమయస్ఫూర్తి కలిగి చురుకుదనం, మానవత్వం కలిగిన సేవకుల్లాగా పనిచేయాల్సి ఉందని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. మంగళవారం కొల్లూరు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ వెంకట మురళి, డిఆర్ఓ, ఆర్డిఓలు, స్పెషల్ ఆఫీసర్లు,జిల్లా ఆధికారులు, విలేజ్ స్పెషల్ ఆఫీసర్లతో సుదీర్ఘ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరద బాధితుల సహాయ కార్యక్రమాల కోసం ఆయా స్టేజీలలో నియమించిన అధికారులందరూ ఒక మంచి ప్రణాళిక కలిగి సమయస్ఫూర్తితో సేవకుల్లా ప్రజలకు సేవలు అందించాలన్నారు. లంక గ్రామాల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు, ఆర్డీవోలు పాల్గొన్నారు.

వరద బాధితులకు సకాలంలో ఆహారం అందించాలి..

- మంత్రులు అనగాని, గొట్టిపాటి రవికుమార్



వరద ప్రాంతాల్లో సహాయక చర్యలపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రులు గొట్టిపాటి, అనగాని

ప్రజాశక్తి-వేమూరు

కృష్ణానదికి సంభవించిన వరదల కారణంగా లంక గ్రామాల్లో చిక్కుకున్న బాధితులకు సకాలంలో తాగునీరు, ఆహార పదార్థాలు అందేవిధంగా క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రులు అనగాని సత్య ప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ సూచించారు. వేమూరు నియోజకవర్గం, కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో వారు వరద పరిస్థితిపై అధికారులతో సమీక్షించారు. కొల్లూరు లాకుల దగ్గర వరద ముంపునకు గురైన వారికి పడవల ద్వారా ఆహార పదార్థాలు, తాగునీరు, మందుల పంపిణీని పర్యవేక్షించారు. మంత్రులతో పాటు బాపట్ల ఎంపీ తెన్నేటి కష్ణప్రసాద్, వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు, జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి, జిల్లా ఎస్పీ తుషార్ డూడి, రేపల్లె ఆర్డిఓ హేళ షారోన్, తాసిల్దార్ సుశీల, మరియు పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

నిరంతరం పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామన్నారు. ఇలాంటి పరిస్థితులలో డయేరియా వంటి అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి లంక గ్రామంలో, గహాలలో పేర్కొన్న బురద తొలగించడానికి పంచాయతీ శాఖ అధికారులు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలన్నారు. దెబ్బతిన్న గహాలు, ప్రభుత్వ సంక్షేమ భవనాలు, వ్యవసాయ, ఉద్యాన పంటలు, రోడ్లు, బోట్ల నష్టం అంచనాల సర్వే పక్కాగా చేపట్టడానికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. లంక గ్రామాలలోని ప్రజల సహాయ చర్యల కొరకు అధికారులు ఛాలెంజ్ గా పనిచేయాలని బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కష్ణ ప్రసాద్ తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తే ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. నిత్యావసర సరుకులు, వైద్యం సకాలంలో అందించేలా చూడాలన్నారు. ఇప్పటివరకు అధికారులు ఎంతో బాగా పనిచేశారని ప్రశంసించారు. సహాయక చర్యలపై పర్యవేక్షణ, చిత్తశుద్ధితో అధికారులు పనిచేస్తే విపత్తు నుంచి పూర్తిగా బయటపడతామని తెలిపారు. వరద తగ్గిన తర్వాత సహాయక చర్యలకు యంత్రాంగం సిద్ధం కావాలని వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు తెలిపారు. అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సూచించారు. గతంలోకంటే వరద చాలా అధికంగా రావడంతో లంక గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. వరద తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విపత్తులో అధికారులు అవిశ్రాంతంగా పనిచేసే పరిస్థితి ఏర్పడిందని ఆయన వివరించారు. ప్రజలకు సహాయం అందించడంలో వెనుకాడరాదన్నారు. అధికారికంగా ప్రకటించే వరకు లంక గ్రామాలలోని ప్రజలు ఎలాంటి రాకపోకలు సాగించరాదని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఎన్ డి ఆర్ ఎఫ్ బందం సమర్థంగా పనిచేస్తుందన్నారు. పోలీసులు నిరంతరాయంగా గ్రామాలలో సహాయక చర్యలు చేపట్టారని తెలిపారు. అధికారికంగా ప్రకటన విడుదల చేసే వరకు ప్రజలు అటు ఇటు తిరగటానికి వీలులేదని పోలీసులకు ఆదేశించామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ఆర్ డి ఓ లు, తదితరులు ఉన్నారు.



వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రులు

వరద బాధితుల కోసం ఆహారపొట్లాలు సిద్ధం



బాధితులకు ఆహారం సిద్ధం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - అద్దంకి

మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో ముంపు గ్రామాల ప్రజల కోసం ఆహారం, తాగునీరు, ఇతర అవసరాలకు ఉపయోగపడే వస్తువులను టిడిపి నాయకులు, కార్యకర్తలు నిత్యం అందుబాటులో ఉండి పట్టణంలోని కామేపల్లి కళ్యాణ మండపంలో రెండు రోజులుగా దాదాపు 30వేల మందికి సరిపడా ఆహార పదార్థాలను సిద్ధం చేసి విజయవాడకు తరలించారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలు ఆకలితో ఉండకూడదనే ఆహారం, తాగునీరు అందేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. టిడిపి పట్టణ నాయకులు దగ్గర ఉండి వంట తయారు చేయించి ప్యాకింగ్ పూర్తయిన తర్వాత మినీ లారీల్లో వరద బాధితుల సహాయార్థం ఆహారం పంపిణీకి వీలు పడే విధంగా ప్యాకెట్లను సిద్ధం చేశారు. పట్టణంలోని కామేపల్లి కళ్యాణ మండపంలో టిడిపి నాయకులు విజయవాడకు తరలించారు. వందల మంది మహిళా కార్మికులు వంట పనిలో నిమగ్నమయ్యారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యద్దనపూడి : స్థానిక శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు పిలుపు మేరకు మండలంలోని జాగార్లమూడి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు వెంకటస్వామి విజయవాడ వరద బాధితులు 3వేల మందికి భోజన ఏర్పాట్లు చేశారు. అదే గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు ఎం నెహెమ్యారావు కుమారుడు దిలీప్ విజయవాడ వరద బాధితులకు రూ.ఒక లక్ష విరాళం అందజేశారు.

ఇంకొల్లు : విజయవాడ వరద బాధితులకు ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు పర్యవేక్షణలో క్షేత్రస్థాయి పర్యటనలో స్వయంగా ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. కాలనీలో ఎమ్మెల్యే ఏలూరి పర్యటించారు. బాధితులకు ధైర్యం చెప్పారు. ప్రజలకు ఆహార, పానీయాలు అందకపోవడంతో బాధితులకు అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. వెంటనే మార్టూరులోని క్యాంపు కార్యాలయంలో భోజనం ప్యాకెట్లు తయారుచేసి సాయంత్రానికి విజయవాడ పంపాలని కార్యకర్తలకు సూచించారు. ఏలూరి పిలుపుతో టిడిపి నాయకులు, అనుచరులు మార్టూరు ఎన్నారై టీడీపీ నాయకులు రంగంలోకి దిగి అప్పటికప్పుడు సరుకులు కొనుగోలు చేసి వంట మాస్టర్లను పిలిపించి ఆహార పదార్థాలను తయారు చేయించారు. తెలుగు యువత సహకారంతో డబ్బాలు, ప్యాకెట్లలో ఆహారాన్ని నింపారు. దీంతోపాటు వేల సంఖ్యలో వాటర్ బాటిల్స్ సేకరించారు. వీటన్నిటిని ఎమ్మెల్యే ఏలూరి పంపించిన ప్రత్యేక వాహనాల్లో లోడ్ చేసి మంగళవారం సాయంకాలంకు విజయవాడ తరలించే విధంగా ఏర్పాటు చేశారు. చేతిలో ఎంత నగదున్నప్పటికీ ఆహారం మంచినీరు దొరకని పరిస్థితి ప్రస్తుతం విజయవాడలో నెలకొన్నది. దీనిని గమనించి వరద బాధితులకు ఆపన్నహస్తం అందించనున్నారు. జీవి మనుగడకు ప్రమాదం ఏర్పడిన పరిస్థితుల్లో ఆపద్బాం ధవుడుగా నిలిచి అన్న పానీయాలు అందిస్తున్నారు. తాను ఇంచార్జిగా ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు ఎటువంటి కష్టాలు రాకూడదని అన్ని తానై వ్యవహరిస్తూ బాధితులకు అండగా నిలిచారు. ఏలూరి పిలుపుతో పలువురు నేతలు వరద బాధితులకు ఆహారం, మంచినీళ్ళు అందించేలా చర్యలు చేపట్టారు.



ఆహారం సిద్ధం చేస్తున్న ఇంకొల్లు, పర్చూరు టిడిపి కార్యకర్తలు

డ్రైనేజీ ఏర్పాటు చేయకపోతే వరద ముప్పు

ప్రజాశక్తి - పర్చూరు

వాయుగుండం ప్రభావంతో పర్చూరు వాగు ఉగ్రరూపం దాల్చింది. పర్చూరు, కారంచేడు మండలాల్లో వాగుపై జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిర్మాణం చేస్తున్న వంతెన పనులు నీట మునిగాయి. ఒక్కసారిగా ఎగువ నుంచి వరద నీటి ప్రవాహం ఉగ్రరూపం దాల్చడంతో ఉప్పుటూరు వద్ద నిర్మిస్తున్న రెండు భారీ వంతెన ఫిల్లర్లు నీట మునిగాయి. నీటి పారుదల పరిస్థితి లేకపోవడంతో మునిగి పోయాయి. నీరు పారేందుకు ప్రత్యామ్నాయంగా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోతే రాబోయే రోజుల్లో వరదలు పోటెత్తి పంట పొలాలు, స్థానిక గ్రామాలు మునిగే పోయే పరిస్థితి పొంచి ఉన్నది. పర్చూరుకు ఎగువ ప్రాంతంలోని పసుమర్రు పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతుల భూముల్లోని వాన నీరు వరద నీరు పిల్ల కాలువల ద్వారా రోడ్డు వెంట ఉన్న భారీ కాలవల్లోకి చేరి పర్చూరు వైపునకు ప్రవహించేది. అయితే ప్రస్తుత పరిస్థితి రోడ్డు విస్తరణలో భాగంగా ఈ కాలువ మొత్తం ఊడిపోవడంతో వరద నీటి పారుదల పరిస్థితి లేక వాన నీరంతా రైతు భూముల్లో నిలిచాయి. స్థానిక వై జంక్షన్ నుంచి ఉప్పుటూరు వరకు నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణంతో పర్చూరులోని వరద నీరు దిగువకు చేరేందుకు కష్టంగా మారింది. అక్కడ నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు వరదనీటిపారుదులకు అడ్డుగా మారింది. దీనివల్ల రానున్న రోజుల్లో పర్చూరుకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి పర్చూరు, కారంచేడు మొండి కాల్వ వరకు నాలుగు వరసలుగా వెడల్పు చేస్తున్న జాతీయ రహదారి నిర్మాణ పనులతో రైతులు సాగు చేసే పంట భూములను వరద ముంచేత్తనుంది. మూడు రోజులుగా కురుస్తున్న వానలకే పర్చూరు, కారంచేడు మధ్య పడమరవైపు పొలాలన్నీ సముద్రాన్ని తలపించాయి. ఈ నీరంతా దిగువకు చేరే దారి లేక ఎన్ని రోజులు పొలాలు నీటిలో ఉండాలో తెలియక దిక్కుతో అయోమయ స్థితిలో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి నిర్మాణంతో పంట పొలాలు దెబ్బతింటాయని, గ్రామాలకు వరద నీటి ముంపు తప్పదని ముందు చూపుతో ప్రజలు ఆందోళనకు దిగారు. వారం రోజులు క్రితం తిమ్మరాజుపాలెం వద్ద చేపట్టిన రహదారి పనులను నాలుగు గ్రామాల ప్రజలు నిలిపివేశారు. నిర్మాణంలో ఉపయోగించే తూములకు బదులు వంతెన నిర్మాణం చేపట్టాలని ఆందోళనకు దిగారు. దీంతో రెవెన్యూ, డ్రైనేజీ, హైవే అధికారులు వచ్చి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. నెలరోజుల క్రితం పర్చూరు, కారంచేడు మధ్య నెలకొన్న ఇదే పరిస్థితిని హైవే అధికారులు దృష్టికి తీసుకువెళ్లగా తాత్కాలికంగా చిన్న కాలువను తవ్వి నీటిపారుదలకు చర్యలు చేపట్టారు. ఒక్కసారిగా వరద ముంచెత్తటంతో ఆ కాలువ పరిమాణం సరిపోక పొలాలు నీట మునిగిపోయాయి. ఇప్పటికైనా గ్రామాలకు వరద ముప్పు తొలగించేందుకు, పంట పొలాలు నష్టపోకుండా మెరుగైన డ్రైనేజీని ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులను వేడుకుంటు న్నారు. సంబంధిత అధికారులు కళ్ళ ముందు కనపడు తున్న ఈ సమస్యను బాధ్యతతో పరిష్క రించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.



వరదతో నిలిపోయిన బైపాస్ నిర్మాణ పనులు

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పోలీసు అధికారులు విద్యార్థులకు సూచించారు. స్థానిక బిసి, ఎస్సీ హాస్టల్స్‌లో చదువుతున్న విద్యార్థులకు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ అరికట్టడానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్ ఎవరైనా వాడు తున్నారని తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఒక్కసారి గంజాయి సేవిస్తే ఆరు నెలల వరకు వారి మూత్రంలో అవశేషాలు ఉంటాయని అన్నారు. చెడు అలవాట్లతో బంగారు భవిష్యత్తు అంధకారం అవుతుందని అన్నారు. ఎవరైన గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వంటివి తీసుకోవద్దని సూచించారు. సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ కె కొండలు, కానిస్టేబుల్ జి బ్రహ్మయ్య పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న హెచ్‌సి కె కొండలు



మునిగిన పంటలు పరిశీలిస్తున్న ఎఒ రమేష్‌బాబు

వరి పొలాల్లో నీటిని తొలగించాలి

ప్రజాశక్తి - నగరం

మండలంలో భారీ వర్షాల కారణంగా నీట మునిగిన పంట పొలాలను నగరం, ఈదుపల్లి గ్రామాల్లో ఎఒ బి రమేష్ బాబు, బాపట్ల డిడిఎ డిఆర్సి బాపట్ల విజయ్ నిర్మల ఆధ్వర్యంలో సైంటిస్ట్ డాక్టర్ మృదుల, డాక్టర్ ఉష నీరు నిలిచిన వరి పొలాలు పరిశీలించారు. నీరు తగ్గిన వెంటనే తెగుళ్ళు మందు ఏదైనా పిచికారి చేయడం ద్వారా మొక్క దృఢంగా వుండి తెగుళ్ళు రాకుండా అరికట్టవచ్చని తెలిపారు. రైతులు నీటిని బయటకు పంపి జాగ్రత్తలు పాటించి పంటను రక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ కృష్ణ మోహన్, రైతులు సమ్మెట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : భారీ వర్షాలకు నీట మునిగిన వరి పొలాల్లోని నీటిని బయటకు తరలించేందుకు రైతులు చర్యలు చేపట్టాలని డిడిఎ విజయనిర్మల, శాస్త్రవేత్త డాక్టర్ మృదుల తెలిపారు. మండలంలోని సూరేపల్లిలో నీటమునిగిన వరి పంట పొలాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు అధికారులకు వివిధ సమస్యలు విన్నవించారు. ఈపాటికే పైరు నీటిలో మునిగి నాలుగు రోజులైందని, నీరు పూర్తిగా బయటకు వెళ్లేందుకు మురుగు కాలువలు పూడిపోవడంతో మరో వారం రోజులు పడుతుందన్నారు. నీరు బయటకు వెళ్లిన అనంతరం 30కిలోలు యూరియ, 20 కిలోల పొటాష్ ఎకరాకు వెదజల్లి పైరుపై కార్బన్డైజమ్ మ్యానుకో జాబ్ మందులు పిచికారి చేసి తెగులు సంక్రమించకుండా కాపాడుకోవాలని తెలిపారు. అమర్తలూరు మండలంలో అధికారులు నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి రైతులకు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఉష, వ్యవసాయ అధికారులు జి మీరయ్య, ఎఇఒలు, విఎఎలు పాల్గొన్నారు.



పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



ఈపూరిపాలెం పిహెచ్‌సి వద్ద ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

ఆశా కార్యకర్తల జీతాలు పెంచాలని ధర్నా

ప్రజాశక్తి - చీరాల

ఆశ కార్యకర్తల జీతాలు పెంచి, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి ఆశా కార్యకర్తల యూనియన్ ఆధ్వర్యంలో మండలంలోని ఈపురుపాలెం పిహెచ్‌సి వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి ఝాన్సీ, వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ తమ వేతనాలు పెంచాలని ఎన్నికలకు ముందు ప్రభుత్వంతో జరిగిన ఒప్పందంలో జిఒలు విడుదల చేయాలని కోరారు. ఫీల్డ్ వర్క్, సెంటర్ వర్క్, పని చేయని ఫోన్స్‌తో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. తమకు సెలవు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు గురించి పరిష్కరించాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని పిహెచ్‌సి డాక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు డి మాధవి, సహిన, శ్యామల, సుశీల, షాహిదా పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో యాజమాన్యం

జాబ్ మేళాలో 39 మంది ఎంపిక

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలోని బేతపూడి రోడ్డులోని శారద ఐటిఐ కాలేజీలో మంగళవారం జాబ్ మేళా నిర్విహించారు. కాలేజీ డైరెక్టర్ బడుగు వెంకటనారాయణ అధ్యక్షతన జరిగిన జాబ్ మేళాలో తడ శ్రీ సిటీకి చెందిన కొల్గేట్ కంపెనీ, గుంటూరుకు చెందిన నియోక్రాఫ్ట్ మెడికల్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ హాజరయ్యారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్ చదివిన 40 మంది విద్యార్థులు హాజరు కాగా 39మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రూ.15వేల జీతంతో పాటు ఉచిత వసతి కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పి చందు, వరప్రసాద్, మండి ప్రసాద్, బడుగు జ్యోత్స్న, అన్నం హరీష్, శారద ఐటిఐ సిబ్బంది పాల్గొన్నారు.



బాధితులకు ఆహారం అందజేస్తున్న మురళీమోహన్

వరద బాధితులకు అహారం పంపిణీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎపిసిపిఎస్ఈఎ సంఘం ఆధ్వర్యంలో వెల్లటూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో ఏర్పాటు చేసిన వరద బాధితుల పునరవాస కేంద్రంలో పెదపాలెం, కిష్కిందపాలెం, తిప్పలకట్ట గ్రామాలకు చెందిన ప్రజలకు పౌష్టికాహారం అందజేసినట్లు జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల ప్రభావితులైన బాధితుల సహాయార్థం స్వచ్ఛందంగా అందరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో శివరామకృష్ణ, డిప్యూటీ తహశీల్దారు శ్రీనివాసరావు, షైనీ, రామారావు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.


పోతుల సునీత దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

సునీత దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - చీరాల

వైసిపిలో ఎమ్మెల్సీగా ఉన్న పోతుల సునీత ఇటీవల రాజీనామా చేసిన నేపథ్యంలో ఆమెను టిడిపిలోకి చేర్చుకోవద్దంటూ టీడీపీ నేతలు స్థానిక గడియారం సెంటర్లో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఆమెను తమ పార్టీల్లో చేర్చుకోవద్దంటూ టిడిపి, జనసేన, బిజెపి నాయకులు రోడ్డుపై బయటాయించి నిరసన తెలిపారు. గడియార స్తంభం సెంటర్లో ఆమె ఫ్లెక్సీలను దగ్ధం చేశారు. తమ పార్టీలో ఉంటూ చంద్రబాబుకు వెన్నుపోటు పొడిచిన సునీత గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. చంద్రబాబు పెట్టిన రాజకీయ భిక్షతో హోదాను అనుభవించిన ఆమె వెన్నుపోటు రాజకీయం చేసిందని అన్నారు. కష్టకాలంలో టిడిపికి, చీరాల ప్రజలకు అండగా ఉండాల్సిన ఆమె రాజకీయ లబ్ధి, స్వార్థం కోసం వైసీపీలో ఊసరవెల్లి రాజకీయం చేసిందన్నారు. ఇప్పుడు వైసీపీ ఘోరంగా ఓడిపోవడంతో తిరిగి టీడీపీ, కూటమి పార్టీల్లో చేరేందుకు సిద్ధమవడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని విషయాలను గమనించి ఆమెను కూటమి ప్రభుత్వానికి దూరంగా ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీను, కౌతరపు జనార్దన్, దేటా నాగేశ్వరరావు, తేజ, ఉసురుపాటి సురేష్, కొమ్మనబోయిన రజిని జనసేన నాయకులు మామిడాల శ్రీనివాసరావు, గుడూరి శివరామ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే వరద

ప్రజాశక్తి - చెరుకుపల్లి

భారీ వర్షాల వలన నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.15వేలు, వాణిజ్య పంటల రైతులకు ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లిముంత సాంబశివరావు, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకులు మర్రివాడ వెంకటరావు డిమాండ్ చేశారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారీ వర్షాలకు నష్టపోయిన ప్రతి ఒక్కరికి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ప్రతి కుటుంబానికి ఆహార ధాన్యాలు, నగదులు అందజేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షలపైగా ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనాలు ఉన్నాయని తెలిపారు. కొంత మంది మృతి చెందారని నివేదికలు తెలుపుతున్నాయని అన్నారు. వారందరికీ నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున వరదలు, ముంపు రావడానికి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని వర్షాలు ప్రారంభం కావడానికి మూడు రోజుల ముందుగానే భారీ వర్షాల ప్రమాదం గురించి రాష్ట్ర ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖ అధికారులకు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ తగిన విధంగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. భవిష్యత్తులో ఎటువంటి నష్టం వాటిల్లకుండా కరకట్టలను పటిష్టం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి ఆహ్వానం

ప్రజాశక్తి - చీరాల

స్థానిక వైఎ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2024 - 25 విద్యా సంవత్సరానికు డిగ్రీ కోర్సుల్లో బోటని, ఎకనామిక్స్ సబ్జెక్టులను బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ మురళి మంగళవారం తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పిజి నందు 55శాతం మార్కులతోపాటు నెట్, సెట్, పిహెచ్డి కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు డెమో క్లాస్, ఇంటర్వ్యూకు ఈ నెల 9న కళాశాలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ఆశా కార్యకర్తల సేవలు అభినందనీయం


ఆశా కార్యకర్తల దినోత్సవంలో డాక్టర్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి మెరుగైన వైద్య సేవ అందించడంలో హెచ్ఐవి, ఎయిడ్స్ నిర్మూలనకు హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు క్షేత్రస్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఆశ వర్కర్స్ వైద్య సేవలు అమూల్య మైనవని పిహెచ్సి ఎంపిహెచ్ఈఓ నాగేశ్వరరావు పేర్కొన్నారు. జాతీయ ఆశా కార్యకర్తల దినోత్సవం సందర్భంగా ప్రకాశం, బాపట్ల ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టిబి ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. హెల్ప్ టిబి వర్కర్ శ్రావణి అధ్యక్షతన పట్టణంలోని గీతా మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీ హెచ్ ఈఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఆశా కార్యకర్తల సేవలు విలువైనవని అన్నారు. సీజనల్ వ్యాధులు సంక్రమించినప్పుడు క్షేత్రస్థాయిలో వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు, మందులు అందిస్తుంటారని అన్నారు. 1097 టోల్‌ఫ్రీ నంబర్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్య త మనందరిపై ఉందని అన్నారు. ఎఆర్టి నుండి మందు లు ఐసిటిసి సెంటర్స్ గురించి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్ప్ టిబి మల్లేశ్వరి, కరుణ, హెల్ప్ సూపర్వైజర్ అబ్దుల్ సత్తార్, పిఈలు పార్వతి, శివ పార్వతి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

మేదరమెట్ల : జాతీయ ఆశ వర్కర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక పిహెచ్సి ఆవరణలో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టిబి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పిహెచ్సి డాక్టర్ జి చిట్టిబాబు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో ఆశా కార్యకర్తల సేవలు అద్వితీయం అన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు వివరిస్తూ ఉన్నారని అన్నారు. ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించి, నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. పిహెచ్సి ఎంపిహెచ్ బ్రహ్మానందం, ఎస్‌కె మహబూబ్ జానీ, సుధా, పద్మావతి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


మేదరమెట్లలో మాట్లాడుతున్న వైద్యాధికారి చిట్టిబాబు

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక


కె పద్మావతి


పావులూరి శ్రీనివాసరావు


కె నరసింహారెడ్డి

ప్రజాశక్తి - కారంచేడు

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఏటా ఉపాధ్యాయులకు అందించే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు మండలంలోని కుంకలమర్రు జెడ్పి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు కె పద్మావతి, అదే గ్రామంలో మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు పావులూరి శ్రీనివాసరావు, స్వర్ణపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కె నరసింహారెడ్డి ఎంపికయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక కావడం పట్ల తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎంఇఒలు ఎంవి సత్యనారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అభినందించారు.

అద్దంకి : చక్రాయపాలెం ఉన్నత పాఠశాల్లో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు జ్యోతి నిర్మల, కరి రామయ్య, మానికొండ ధనలక్ష్మి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.


జ్యోతి నిర్మల


కరి రామయ్య


మానికొండ ధనలక్ష్మి

సొసైటీ భూముల రైతులకు పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కృష్ణానది వరదకు నష్టపోయిన దళిత, గిరిజన సొసైటీ భూముల రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించే విధంగా చర్యలు చేపట్టాలని వైసిపి ఇన్చార్జ్ వరికూటి అశోక్ బాబు డిమాండ్ చేశారు. కృష్ణానది వరద పరిస్థితిని ఆయన వెల్లటూరు, ఓలేరు వద్ద మంగళవారం పరిశీలించారు. ప్రస్తుత వరదలకు రైతులు రూ.లక్షలు వెచ్చించి సాగు చేసిన గంటలకు ఈ క్రాప్, భీమాతో పని లేకుండా నష్ట పరిహారాలు అందించాలని కోరారు. ఈ మేరకు వరదలో చిక్కుకున్న బాధిత కుటుంబాలకు అందిస్తున్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద బాధితులకు వైసిపి అండగా ఉంటుందని భరోసా నిచ్చారు. ఆయన వెంట ఎంపీపీ డివి లలిత కుమారి, ఎంపిటిసి కొతరపు పద్మావతి, వెల్లటూరు మాజీ సర్పంచ్ చౌటూరి లక్ష్మి రవీంద్ర, పెరికల పద్మారావు, నాగమల్లేశ్వరరావు, సిరాజుద్దీన్, కరీంశెట్టి బాలు ఉన్నారు.


బాధితులతో మాట్లాడుతున్న అశోక్ బాబు

20 నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తాం

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలో ఈనెల 20 నాటికి ఆర్ఎస్-2లోని స్లాబ్ మట్టానికి నిర్మించబడి ఉన్న ఇండ్లను పూర్తి చేస్తున్నట్లు హౌసింగ్ ఎఇ బి రమణా నాయక్ మంగళవారం తెలిపారు. ఇప్పటివరకు బేస్ మట్టం నుండి పూర్తిగాని బిఎల్, ఆర్ఎల్ కలిపి 235 ఇండ్లను మార్చి 25నాటికి పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులు వెంటనే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎఇ కోరారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకపోతే ప్రభుత్వం బాధ్యత వహించదన్నారు. ఈనెల 13న అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి హౌసింగ్ లబ్ధిదారులకు ఇల్లు పూర్తయ్యే విధంగాఅవగాహన కల్పిస్తామన్నారు. లబ్ధిదారులు గ్రామాల్లో జరిగే గ్రామసభల్లో పాల్గొని జయప్రదం చేయాలని హౌసింగ్ ఎఇ తెలిపారు.


బాధితులకు ఆహారం అందజేస్తున్న కార్తీక్

సహాయక చర్యల్లో కార్తీక్ ఫౌండేషన్

ప్రజాశక్తి - వేమూరు

కృష్ణానది తీర ప్రాంతం అకాల వర్షాల కారణంగా ప్రకాశం బ్యారేజ్ నుంచి కృష్ణా నదిలోకి వరద నీళ్లు విడుదల చేయడంతో వరద ఉధృతి పెరిగి లంక గ్రామాలు వరద ముంపుకు గురైయ్యాయి. గ్రామాల్లోని ప్రజలు నీటిలో చిక్కుకుని సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. వరద బాధితులకు కార్తీక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ నండూరి కార్తీక్ తన బృందంతో నాటు పడవల్లో వెళ్లి కొల్లూరు మండలంలోని ముంపు ప్రాంతాల్లో ఇంటిపై నివసిస్తున్న బాధితులకు ఆహారం ప్యాకెట్లు, మంచినీటి బాటిళ్లు, పాలు, గుడ్లు అందించారు. పోతర్లంక ప్రజలకు అందజేశారు. అదే గ్రామానికి చెందిన బొడ్డు సాంబయ్యకు చెందిన 24 గొర్రెలను సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ దృశ్యాలను చూసిన అధికారులు, ప్రజలు ప్రశంసించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నండూరి సుమన్, చేబ్రోలు ఏసుబాబు, అల్లమూడి భరత్, శ్రీను పాల్గొన్నారు.


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్వైజర్ లీలావతి

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి - చీరాల

చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అంగనవాడి కేంద్రంలో పౌష్టిక ఆహారం అందిస్తున్నట్లు సూపర్వైజర్ లీలావతి తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా వేటపాలెం ప్రాజెక్ట్ పరిధిలోని రామనగర్ అంగన్‌వాడీ సెంటర్లో అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గర్భవతులు, బలింతలు, కిషోరి బాలికలు, స్కూల్ పిల్లలకు రక్త పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ శాతం గురుంచి, రక్త హీనత గురించి వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే తృణ ధాన్యాలను ఉపయోగించే పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆకు కూరలు, సిట్రస్ ఫ్రూట్స్ వంటివి ఆహారంలో తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కె సునీత, రాజ్యలక్ష్మి, రజిని పాల్గొన్నారు.


రోడ్డుకు మరమ్మత్తులు చేస్తున్న దృశ్యం

రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని తిమిడిదపాడు, కేశవరప్పాడు గ్రామాల మధ్య వరద ఉధృతికి మూడు రోజుల క్రితం పిల్లవాగు దగ్గర కొట్టుకుపోయిన రోడ్డును అధికారులు మంగళవారం తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. వరద ఉధృతి తగ్గడంతో రోడ్డుకు ఇరువైపుల ఇసుక బస్తాలు వేసి రోడ్డుపై గ్రావెల్‌తో నింపారు. ప్రజల రాకపోకలకు అనుకూలంగా చేశారు.


లోకేష్‌కు రూ.7 లక్షల విరాళం అందజేస్తున్న రమణారెడ్డి

మానవత్వం చాటుకున్న ఏవి.రమణారెడ్డి

వరద బాధితులకు రూ.7 లక్షల విరాళం అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

శ్రీ సరస్వతి విద్యాసంస్థల ఛైర్మన్ ఏవి రమణారెడ్డి మానవత్వం చాటుకున్నారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.7 లక్షల విరాళాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు అందజేశారు. వాయుగుండం ప్రభావంతో విజయవాడలో కురిసిన భారీ వర్షాలకు అనేక ప్రాంతాలు నీట మునిగాయి. వరద నీరు పోటెత్తడంతో విజయవాడలోని పలు ప్రాంతాల్లో సాయం కోసం ప్రజలు ఎదురుచూపులు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో వరద బాధితులకు సాయం అందించాలని సిఎం నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుమేరకు ఒంగోలులోని శ్రీ సరస్వతి విద్యాసంస్థల ఛైర్మన్ ఏవి రమణారెడ్డి స్పందించారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు సమక్షంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని ఏవి రమణారెడ్డి కలిసి వరద బాధితుల సహాయార్థం శ్రీసరస్వతి విద్యాసంస్థల తరపున రూ.7 లక్షల విరాళాన్ని అందజేశారు. వరద బాధితులకు సాయం అందించేందుకు ముందుకొచ్చిన ఏవి రమణారెడ్డిని మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు అభినందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు టివి శ్రీరామమూర్తి, మేడికొండ మోహనరావు, శ్రీ సరస్వతి విద్యాసంస్థల డైరెక్టర్లు ఏ.గణేష్ రెడ్డి, ఏ.గంగా శంకర్ రెడ్డి, సిఇఒ ఎన్‌వి సురేష్ పాల్గొన్నారు.

వరద బాధితులకు గోరంట్ల రవికుమార్ సాయం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్


సిద్ధం చేసిన ఆహార ప్యాకెట్లు

విజయవాడ వరద బాధితులకు శ్రీ హర్షిణి విద్యా సంస్థల అధినేత గోరంట్ల రవికుమార్ చేయూత తను అందించారు. రెండు వేల మంది బాధితులకు ఆహార ప్యాకెట్లు, మంచినీటి బాటిళ్ళను బాధితుల కోసం విజయవాడకు పంపించి మానవత్వం చాటుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు విజయవాడ, రాజధాని పరిసర ప్రాంతాలలో నివాస ప్రాంతాలు నీట మునిగి ఎంతో మంది ఆహారం లేక పిల్లలు, పెద్దలు ఇబ్బందులు పడుతున్న దష్ట్యా శ్రీహర్షిణి విద్యాసంస్థల అధినేత, టిడిపి దర్శి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి ఇంచార్జ్ గోరంట్ల రవికుమార్ స్పందించారు. సొంత నిధులతో విజయవాడ వరద బాధితులకు రెండు వేల మందికి పైగా ఆహారపు ప్యాకెట్లు వాటర్ బాటిళ్లు మంగళవారం నాడు విజయవాడ పంపించారు. కార్యక్రమంలో విజేత పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ విజేత రమణ, కళాశాల శివరాం, కళాశాల ప్రిన్సిపల్ దాది ఆంజనేయులు దుర్గ ఆంజనేయులు, బాలకష్ణ, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న నల్లూరి వెంకటేశ్వర్లు

విజయవాడ వరద బాధితుల పట్ల శ్రీ ప్రతిభ/ గురుదత్త విద్యా సంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు మానవత్వం చాటుకున్నారు. శ్రీ ప్రతిభ విద్యా సంస్థల బస్సులలో వరద బాధితులకు 2 వేల పులిహార ప్యాకెట్లు పంపారు. వీటిని బస్సుల ద్వారా ప్రకాశం జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయానికి పంపించారు. వరద బాధితులకు ఆహార ప్యాకెట్లు అందజేసిన శ్రీ ప్రతిభ విద్యా సంస్థల ఛైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లును జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర అభినందించారు. కార్యక్రమాలలో శ్రీ ప్రతిభ, శ్రీగురుదత్త విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సిఈఒ జయప్రకాష్ నారాయణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పులిహోర ప్యాకెట్లు పంపిస్తున్న శ్రీ ప్రతిభ యాజమాన్యం

నాపై విచారణ జరిపించండి

సిఎం చంద్రబాబుకు మాజీ మంత్రి బాలినేని లేఖ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో



తనపై ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, జనసేన పార్టీ కన్వీనర్ రియాజ్ చేస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం నుంచే విచారణ జరిపించాలని కోరుతూ ముఖ్య మంత్రి చంద్రబాబుకు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మంగళ వారం నాడు లేఖ రాశారు. దీన్ని ఆయన మెయిల్ ద్వారా సిఎం కార్యాలయానికి పంపారు. ఒంగోలు ఎమ్మెల్యేతో పాటు జనసేన పార్టీ కన్వీనర్ రియాజ్ పలు ఆరోపణలు చేస్తూ తనపై విచారణ జరిపించాలని తమకు ఫిర్యాదు చేసిన నేపద్యంలో తాను ఈ అభ్యర్ధన చేస్తున్నట్లు వెల్లడించారు. వారి ఆరోపణల్లో నిజం లేదన్నారు. తాను ఏ తప్పు చేయలేదనే అంశంపై గట్టిగా నిలబడతామన్నారు. సిఎం చంద్రబాబును కలిసేందుకు అవకాశం ఇస్తే నేరుగా కలిసి అన్ని విషయాలూ చర్చిస్తామని మాజీ మంత్రి బాలినేని లేఖలో పేర్కొన్నారు. సిఎం చంద్రబాబును అపాయింట్ ఇవ్వాలని కోరినట్లు బాలినేని 'ప్రజాశక్తి'కి వెల్లడించారు.

చిట్టచివరి బాధితుడికీ

ప్రభుత్వ సాయం అందిస్తాం..

వరద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



ఆహార పొట్లాలు అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

విజయవాడ నగరంలో వరదలో చిక్కుకున్న చిట్టచివర బాధితులకు ప్రభుత్వం అందించేందుకు కృషి చేస్తామని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు తెలిపారు. తొలుత ఒంగోలు టిడిపి కార్యాలయం వద్ద 30 వేల మందికి పులిహోర ప్యాకెట్లు, 20 వేల వాటర్ బాటిళ్ళు, 10 వే బిస్కెట్ ప్యాకెట్లు తీసుకెళుతున్న వాహనాలను దామచర్ల జనార్ధనరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విజయవాడ 40, 42 డివిజన్లలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పర్యటించారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మంగళవారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో భవానీపురం, హౌసింగ్ బోర్డు కాలనీ లో క్షేత్రస్థాయిలో వరద పరిస్థితి ని ఎమ్మెల్యే జనార్దన్ గారు పర్యవేక్షించారు. విజయవాడ 42, 40వ డివిజన్లు ఇన్‌ఛార్జిగా దామచర్ల జనార్ధన రావును సిఎం చంద్రబాబు నాయుడు నియమించారు. ఈ మేరకు మంగళశారం విజయవాడ 42, 40 డివిజన్‌లోని విస్తతంగా పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. దామచర్ల ఒంగోలు నుండి తీసుకొచ్చిన 30వేల పులిహార బాక్స్ లు, 20 వేల వాటర్ బాటిల్స్, 15 వేల బిస్కెట్ పాకెట్స్ ను భాదితులకు అందజేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, స్థానిక టీడీపీ ఇంచార్జి బేగ్, భవానీపురం మాజీ కార్పొరేటర్ యెదుపాటి రామయ్య, టివి శ్రీరామ్ మూర్తి, కొఠారి నాగేశ్వరావు, శింగరాజు రాంబాబు, కామేపల్లి శ్రీనివాసరావు, ఎద్దు శశికాంత్ భూషణ్, బండారు మదన్, మేడికొండ మోహన్‌రావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్


విరాళాలు సేకరిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

భారీ వరదల కారణంగా సర్వం కోల్పోయిన బాధితులకు అండగా నిలిచేందుకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఒంగోలు నగరంలోని విద్యార్థుల వద్ద నుండి విరాళాలు సేకరించినట్లు ఎస్ఎఫ్ఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ తెలిపారు. విజయవాడ కేంద్రంగా ఎస్ఎఫ్ఐ నాయకత్వం సేవా సహయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారన్నారు. ఆహారం తయారు చేసి పంపిణీ చేస్తున్నారని, బాధితులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి బాగోగులు చూసుకుంటున్నారని చెప్పారు. ఇటువంటి కష్టకాలాల్లో విద్యార్థులు బాధితులకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి వీరాస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు దేవరాజు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కార్పొరేషన్ కమిషనర్‌కి అర్జీ అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్


కమిషనర్‌ని కలిసిన నాయకులు, మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావును ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కోరారు. స్థానిక కమిషనర్ ఛాంబర్‌లో మంగళవారం ఫెడరేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. యూనియన్ గౌరవాధ్యక్షులు తంగిరాల మహేష్ మాట్లాడుతూ ఒంగోలు నగరంలో స్థానికంగా మున్సిపల్ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. 2024 జనవరి నెల 6000 అలవెన్స్, ఈఎస్ఐ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఈపీఎఫ్ రికార్డులను సరిచేయాలని, చనిపోయిన కార్మికులు ఈపిఎఫ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలన్నారు. మున్సిపల్ కార్మికులకు సిఎల్ ఇవ్వాలని, ఆప్కాస్‌లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, నగర అధ్యక్ష, కార్యదర్శులు నరసింహం, తేళ్ల విజయమ్మ, నాయకులు యు. కుమారి, రంపతొట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈనెల 5 న జరుగనున్న గురుపూజోత్సవ వేడుకల్లో బాపట్ల జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అయిన వారిని సత్కరించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె నారాయణరావు తెలిపారు. వేటపాలెం మండలం అక్కాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాద్యాయులు బి బద్రిరెడ్డి, అమృతలూరు మండలం ప్యాపర్రు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాద్యాయులు పి సాంబశివరావు, కారంచేడు మండలం కుంకలమర్రు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు కె పద్మావతి ఉత్తమ ప్రధానోపాద్యాయులుగా ఎంపికయ్యారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్ నుంచి ఇ శ్యామ్యూల్, చీరాల మండలం జాండ్రపేట బివి అండ్ బిఎన్ ప్రభుత్వ ఉన్నతపాఠశాల నుంచి పి పూర్ణచంద్రరావు, అద్దంకి మండలం చక్రాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల నుంచి పి జ్యోతినిర్మల, వేటపాలెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల నుంచి పివి రామారావు, అద్దంకి మండలం రాజీవ్ నగర్ కాలనీ ఎంపిపి స్కూల్ నుంచి కె.రామయ్య, నిజాంపట్నం మండలం బలవారిపాలెం ఎంపిపి స్కూల్ నుంచి టి.పద్మావతి, అద్దంకి మండలం, సివి స్ట్రీట్ ఎంపియుపి స్కూల్ నుంచి ఎమ్ ధనలక్ష్మి, కారంచేడు మండలం కుంకలమర్రు ఎంపిపి స్కూల్ నుంచి పి.శ్రీనివాసరావు, బల్లికురవ మండలం చెన్నుపల్లి ఎంపియుపి స్కూల్ నుంచి జి శ్రీనివాసరావు, మార్టూరు మండలం ద్రోణాదుల ఎంపిపి ఉర్దూ స్కూల్ నుంచి షేక్ జాన్‌బాషా, బాపట్ల ఎవివి ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ ఎ ఉమామహేశ్వరరావును జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 5న గురుపూజోత్సవం రోజున జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బాపట్ల పటేల్ నగర్‌లోని అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కళ్యాణ మండపంలో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయిన వారిని సత్కరించడం జరుగుతుందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక అయిన వారు గురుపూజోత్సవం రోజున ఉదయం 9 గంటల లోపు హాజరై రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా జిల్లా విద్యాశాఖాధికారి నారాయణరావు కోరారు.

అక్రమ సిగరెట్ల వ్యాపారాన్ని అరికట్టండి

రెవెన్యూ ఇంటెలిజన్స్ డిజికి పొగాకు బోర్డు వినతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్


డిజికి అర్జీ ఇస్తున్న యశ్వంత్, గుత్తా వాసు

దేశంలో పెరుగుతున్న అక్రమ సిగరెట్ల వ్యాపారాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ ఇంటెలిజన్స్ డైరెక్టరేట్ ప్రిన్సిపల్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ సునీల్ కుమార్ సిన్హాకు పొగాకు బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, ఉపాధ్యక్షులు గుత్తా వాసు కోరారు. మంగళవారం వారు ఢిల్లీలో సునీల్ కుమార్ సిన్హాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న అక్రమ సిగరెట్ల వ్యాపారం పొగాకు రైతులకు, ఆర్థిక వ్యవస్థకు, సమాజానికి అతి పెద్ద సమస్య గా మారిందన్నారు. అంతర్జాతీయ స్మగ్లింగ్, స్థానికంగా తయారు చేయబడిన పన్ను-ఎగవేత సిగరెట్‌లతో కూడిన అక్రమ సిగరెట్ వ్యాపారం దేశంలోని సిగరెట్ మార్కెట్‌లో 1/4 వంతు కంటే ఎక్కువగా ఉందన్నారు. ఈ అక్రమ వ్యాపారం నేరుగా భారతీయ పొగాకు డిమాండ్‌ను దెబ్బతీస్తోందన్నారు. దీంతో పొగాకు రైతులు, వారి కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటున్నారని, తెలిపారు. అక్రమ సిగరెట్ వ్యాపారంతో పొందే లాభాలు నేర కార్యకలాపాలకు ఆర్థిక సహాయం చేస్తాయని అంతర్జాతీయ నివేదికలు సూచిస్తున్నాయన్నారు. పొగాకు రైతుల జీవనోపాధిని రక్షించడానికి, పరిశ్రమ భవిష్యత్తును సురక్షితంగా ఉంచడానికి, అక్రమ వ్యాపారంపై పటిష్టమైన చర్యలు తీసుకోవడం అత్యవసరమన్నారు. సిగరెట్ స్మగ్లింగ్, అక్రమ వ్యాపారం ముప్పుపై నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని వారు కోరారు.